సాక్షి ఖమ్మం

శనివారం । 22 । మార్చి । 2025



...అనేక విజయాలు

ఉద్యోగులకు సంబంధించి తక్కువ వ్యవధిలోనే అనేక విజయాలు సాధించామని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం సా॥) 6.26

సహర్ (ఆదివారం ఉ॥) 4.54

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 24°

జిల్లాలో శనివారం రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం ఎండ కాస్త పెరిగినా సాయంత్రానికి చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ వైద్యం



యూపీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ చేసిన డీఎంహెచ్‌ఓ, తదితరులు

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేలా కృషి చేస్తున్నామని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి తెలిపారు. సత్తుపల్లి ఎన్టీఆర్‌నగర్‌లో రూ.1.43 కోట్లతో నిర్మించనున్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులకు శుక్రవారం ఆమె భూమిపూజ చేసి మాట్లాడారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బ బారినపడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం, వ్యాక్సిన్ కేంద్రాలను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రాజెక్టు అధికారి మేకల దుర్గ, డీపీఎం సాంబశివరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నర్సింహ, మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఎండీ.కమల్‌పాషా, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, నారాయణరావు, పింగళి సామేలు, చెన్నారావు పాల్గొన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా



పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎస్‌ఈ, ఉద్యోగులు

ముదిగొండ: వేసవిలో డిమాండ్ మేరకు అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించామని ఎస్‌ఈ శ్రీనివాసాచారి వెల్లడించారు. ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అదనపు భారం పడినా తట్టుకునేలా సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. డీఈలు నాగేశ్వరరావు, భద్రు, ఏడీఈ రామదాసు, ఏఈ ఎం.శ్రీనివాస్, ఏఈలు రాజేష్, బోజ్యా పాల్గొన్నారు.

నేడు సౌర విద్యుత్‌పై అవగాహన సమావేశం

ఖమ్మంవ్యవసాయం: బీడు భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న రైతుల సమావేశాన్ని శనివారం ఏర్పాటుచేసినట్లు ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఖమ్మం ఇల్లెందు క్రాస్‌లోని విద్యుత్ కార్యాలయ గెస్ట్‌హౌస్‌లో ఉదయం 11గంటలకు సమావేశం మొదలవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్, రెడ్‌కో అధికారులతో పాటు రుణ సౌకర్యం అందించే బ్యాంకుల అధికారులు పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

చేనేత కళాకారులకు అవార్డులు


ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర స్థాయిలో కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట ఇవ్వనున్న అవార్డులకు చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం.విజయలక్ష్మి తెలిపారు. చేనేత కళాకారులు, డిజైనర్లకు వృత్తి నైపుణ్యత, ప్రత్యేకతల ఆధారంగా అవార్డులు ప్రకటించనున్నట్లు వెల్లడించారు. కళాకారులైతే 2024 డిసెంబర్ 31నాటికి 30ఏళ్లు నిండి, చేనేత రంగములో పదేళ్ల అనుభవం కలిగిన వారే కాక చేనేత డిజైనర్లకు 25ఏళ్ల వయస్సు పైబడి, ఐదేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. ఈమేరకు దరఖాస్తులను హనుమకొండలోని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో ఏప్రిల్ 15వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

మైన్స్ సేఫ్టీ ఆఫీసర్ పరిశీలన



సీహెచ్‌పీలో అధికారుల బృందం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ, సీహెచ్‌పీలను డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(ఎలక్ట్రికల్) ఆనందవేలు శుక్రవారం పరిశీలించారు. రక్షణ విషయంలో తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్‌వీఆర్.ప్రహ్లాద్, ఉద్యోగులు కేఎస్ఎన్.రాజు, ఎం.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, బి.రాజేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇకపై జోనల్ వ్యవస్థ

కేఎంసీలో పరిపాలన వికేంద్రీకరణకు ఏర్పాట్లు

- నాలుగు జోన్ల ఏర్పాటు.. ఆపై సెంట్రల్ ఆఫీస్‌గా కేఎంసీ
- ప్రతీ జోన్‌లో నాలుగు విభాగాలతో కార్యాలయం
- శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ సేవలు అక్కడి నుండే

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను మరింత చేరువ చేసేలా జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారు. తద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని పాలకవర్గం, అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్, వరంగల్ నగరాల మాదిరిగా ఖమ్మంలో కూడా జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించగా.. పనులు వేగిరమయ్యాయి. నగరానికి తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణ దిక్కుల్లో నాలుగు జోన్లు ఏర్పాటుచేసి.. మధ్యలో ఉన్న కేఎంసీ కార్యాలయాన్ని కేంద్ర ప్రధాన కార్యాలయంగానే కాక ఐదో జోన్‌గా పరిగణనలోకి తీసుకుంటారు. ఈమేరకు నాలుగు ప్రాంతాల్లో జోనల్ కార్యాలయాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న భవనాలను కమిషనర్ అభిషేక్ అగస్త్య శుక్రవారం పరిశీలించారు.

ఐదు లక్షల మంది జనాభా

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 60డివిజన్ల పరిధిలో సుమారు ఐదు లక్షల మంది జనాభా నివాసముంటున్నట్లు అధికారిక అంచనా. ఇందులో ప్రతీ లక్షకు పైగా జనాభాకు ఒక జోనల్ కార్యాలయం చొప్పున నగరంలో మొత్తం నాలుగు కార్యాలయాలు ఏర్పాటుకానున్నాయి. ఇప్పటికే నగరం జనాభా, విస్తీర్ణం, ఇతర అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించగా కమిషనర్ పరిశీలించి, ఎక్కడెక్కడ కార్యాలయాల ఏర్పాటు చేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుందో గుర్తించారు.



కైకొండాయిగూడెంలో జీపీ భవనం వద్ద ఉద్యోగులతో చర్చిస్తున్న కమిషనర్ అభిషేక్

వినతుల స్వీకరణ, పరిష్కారం అక్కడే..

ప్రస్తుతం నగర నలుమూలల ప్రజలకు ఏ సమస్య ఎదురైనా కేఎంసీ కార్యాలయానికి రావాల్సి వస్తోంది. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ సహా ప్రతీ సమస్యపై ఇక్కడే ఫిర్యాదులు ఇస్తుండగా.. వాటిని పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు పంపించి, పరిష్కరించడానికి వారాలు పడుతోంది. ఇప్పుడు జోనల్ ఆఫీసులు ఏర్పాటు చేస్తే అక్కడే సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి విభాగాల వారీగా సిబ్బందితో పరిష్కరించడం సులువవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎవరెవరు ఉంటారు?

ప్రతీ జోనల్ కార్యాలయంలో ఒక ఏఈఈ(ఇంజనీరింగ్) అధికారి, టీపీఎస్, ఆర్‌ఐతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు నిర్వర్తించనున్నారు. వీరి పరిధిలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, వర్కర్లు, బిల్లు కలెక్టర్లు సైతం ఉంటారు. ఇక ప్రతీ రెండు డివిజన్లకు ఒక వార్డ్ ఆఫీసర్‌ను కూడా కేటాయిస్తారు. జోనల్ కార్యాలయాలకు కేటాయించిన ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పౌర సేవలు అందించనున్నారు.

పది రోజుల్లో ప్రారంభిస్తాం..

జోనల్ కార్యాలయాల ఏర్పాటు ప్రక్రియ చివరి దశకు చేరింది. ఇప్పటికే భవనాలను గుర్తించాం. వీటి మరమ్మతులు చేయించి కార్యాలయ కార్యకలాపాలకు అనువుగా తీర్చిదిద్దుతాం. ఏప్రిల్ 1వ తేదీ నాటికి కార్యాలయాలు సిద్ధం చేసి జోనల్ వ్యవస్థను ప్రారంభిస్తాం. ఆతర్వాత అక్కడ నుండే ఆయా ప్రాంతాల ప్రజలకు పౌరసేవలు అందుతాయి.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

నలుదిక్కులా..

జోనల్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన భవనాలను ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ అభిషేక్ అగస్త్య శుక్రవారం పరిశీలించారు. ఉత్తరాన ఏర్పాటు చేసే కార్యాలయం కైకొండాయిగూడెం జీపీలో, తూర్పున ఎస్‌బీఐటీ వద్ద పబ్లిక్ హెల్త్ ఆఫీస్‌లో, పడమర(త్రీటౌన్)కు సంబంధించి ప్రస్తుతం 25వ డివిజన్ కమ్యూనిటీ హాల్‌లో, దక్షిణ ప్రాంతానికి సంబంధించి పాత మున్సిపల్ కార్యాలయంలో జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. త్రీటౌన్ ప్రాంతానికి సంబంధించి అనువైన భవనం లభించాక పడమర జోన్ కార్యాలయాన్ని అందులోకి మార్చే అవకాశముంది. ఇవన్నీ ఏర్పాటయ్యాక ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నాలుగు జోనల్ కార్యాలయాలను కలుపుతూ సెంట్రల్ హెడ్ ఆఫీస్(జోన్–5)గా అవతరిస్తుంది.

రేషన్‌కార్డు దరఖాస్తులపై యాప్‌తో విచారణ

ఖమ్మం సహకారనగర్: ప్రజాపాలన గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం అందిన దరఖాస్తుల ఆధారంగా మీ సేవ యాప్‌తో విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. కాగా, జిల్లాలోని 21 మండలాల పరిధిలో 66,115 దరఖాస్తులు రాగా వీటి ఆధారంగా విచారణ చేపట్టి అర్హులను గుర్తించారు. ఇందుకోసం ఎంపిక చేసిన 120మంది ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లకు లాగిన్లు కేటాయించి శిక్షణ ఇవ్వనున్నారు. ఆతర్వాత క్షేత్రస్థాయి విచారణ మొదలవుతుందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు.

ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం



పరీక్ష హాల్‌లో విద్యార్థినీ, విద్యార్థులు

- ముందుగానే చేరుకున్న విద్యార్థులు
- తొలిరోజు 30మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 97కేంద్రాలు ఏర్పాటుచేయగా, 16,438మంది విద్యార్థులకు గాను 16,408మంది హాజరయ్యారు. మరో 30మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఉదయం 9–30నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు జరిగే పరీక్షకు 8–30గంటల నుంచే అనుమతిస్తామని చెప్పడంతో విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. కాగా, పరీక్షా కేంద్రాల వద్ద నోటీస్ బోర్డుపై విద్యార్థుల హాల్‌టికెట్లతో నంబర్లు, గదుల నంబర్ల వివరాలతో పాటు ఎంఈఓ, డీఈఓల ఫోన్‌నంబర్లు రాయాల్సి ఉంది. కానీ పలు కేంద్రాల వద్ద అధికారుల నంబర్లు లేని అంశాన్ని డీఈఓ సోమశేఖరశర్మ దృష్టికి తీసుకెళ్లగా అన్ని కేంద్రాల బాధ్యులకు సూచనలు చేస్తామని తెలిపారు.

తొలుత ఆలయాల్లో పూజలు

విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు తొలుత హాల్‌టికెట్లతో ఆలయాల్లో పూజలు చేశారు. ఆతర్వాత తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాలకు చేరుకోగా, పిల్లలకు వారు జాగ్రత్తలు చెప్పి వెనుదిరిగారు.

అబ్జర్వర్ సందర్శన

జిల్లాలో పలు పరీక్షా కేంద్రాలను ఉమ్మడి జిల్లా పరీక్షల అబ్జర్వర్ విజయలక్ష్మీబాయి సందర్శించారు. కూసుమంచి, ఖమ్మం నయాబజార్, రిక్కాబజార్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె ఏర్పాట్లపై ఆరా తీశారు. అలాగే, డీఈఓ సోమశేఖరశర్మ ఏడు, అసిస్టెంట్ కమిషనర్ ఒకటి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 38 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి.



ఆలయంలో పూజలు చేయిస్తూ..



పరస్పరం శుభాకాంక్షలు చెప్పకుంటున్న విద్యార్థినులు

ప్రభుత్వ లక్ష్యం మేర రుణమంజూరు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవ్యవసాయం: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా బ్యాంకర్లు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించగా ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు ప్రభుత్వ నిర్దేశిత రుణాలను సకాలంలో మంజూరు చేయాలని తెలిపారు. 2024–25 వార్షిక రుణ ప్రణాళికలో డిసెంబర్ 2024 వరకు రూ.3,610.49 కోట్ల స్వల్పకాలిక పంట రుణాలు, రూ.1,801.04 కోట్ల వ్యవసాయ టర్మ్ రుణాలు అందాయని చెప్పారు. రానున్న కాలంలోనూ వ్యవసాయ రుణాలు సకాలంలో అందించడం ద్వారా రైతులకు అండగా నిలవాలని సూచించారు. ఇక సూక్ష్మ రుణాల కింద సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకు రూ.1,569.82 కోట్లు, విద్యా రుణాలుగా రూ.24.63 కోట్లు, గృహ రుణాలు రూ.73.97కోట్లు అందించారని చెప్పారు. మొత్తంగా డిసెంబర్ 2024 వరకు జిల్లాలో రూ.11,463 కోట్ల మేర బ్యాంకుల ద్వారా అందించారని, ఇదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని, జిల్లాలోని 891మహిళా సంఘాలకు అందించిన రూ.17,769.95 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలతో వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని అదనపు కలెక్టర్ వెల్లడించారు. ఆతర్వాత పాడి, మత్స్య పరిశ్రమలకు రుణాల మంజూరు, డిజిటల్ సేవలపై ప్రజలకు అవగాహన తదితర అంశాలపై చర్చించగా రుణ మంజూరు, లక్ష్యాల వివరాలతో రూపొందించిన బ్రోచర్లు ఆవిష్కరించారు. ఇంకా ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఆర్బీఐ ఎల్‌డీఓ పల్లవి, నాబార్డ్ డీడీఎం సుజిత్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్ బాబు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వాసవీరాణితో పాటు వివిధ బ్యాంకుల అధికారులు జి.లింగస్వామి, హన్మంతరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



క్రెడిట్ ప్లాన్ బ్రోచర్లు ఆవిష్కంచిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, బ్యాంకర్లు

ప్రతీ మనిషికి 100 లీటర్లు

- వేసవిలోనూ సాఫీగా తాగునీటి సరఫరా
- గత ఏడాదితో పోలిస్తే 20శాతం అధికంగా నీరు
- పైపులైన్ లేనిచోట్ల ప్రత్యామ్నాయ మార్గాలు
- మిషన్ భగీరథ ఎస్‌ఈ గడ్డం శేఖర్‌రెడ్డి



గడ్డం శేఖర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఎండలు ముదురుతున్న నేపథ్యాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఇక్కట్లు ఎదురుకాకుండా ప్రణాళికాయుతంగా వ్యవహరించనున్నట్లు మిషన్ భగీరథ ఎస్‌ఈ గడ్డం శేఖర్‌రెడ్డి వెల్లడించారు. వచ్చే ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనూ ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించేలా తమ శాఖ అధికారులు, సిబ్బంది ఇప్పటికే సమాయత్తమయ్యారని తెలిపారు. కొద్దిరోజుల క్రితం గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నేతృత్వాన హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చేసిన సూచనల మేరకు గత నెలలోనే ముందస్తుగా క్షేత్రస్థాయిలో పరిశీలించామని ఎస్‌ఈ చెప్పారు. మిషన్ భగీరథ ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించిన ఆయన వేసవి సన్నద్ధతపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. ఈమేరకు ఎస్‌ఈ వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే...

22గ్రామాలకు స్థానిక వనరులతో...

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,530 గ్రామాలకు గాను ఖమ్మం జిల్లాలో 931 గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఏడు గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా కాకుండా స్థానిక వనరులతో నీరు అందిస్తున్నాం. అలాగే, భద్రాద్రి జిల్లాలోని 1,599 గ్రామాలకు గాను 15గ్రామాల్లో స్థానికంగానే నీరు సమకూరుస్తున్నాం.

వేసవికి ప్రత్యేక ప్రణాళిక

వేసవి సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గత నెల రోజులుగా ప్రణాళికలు సిద్ధం చేశాం. గత నెలలోనే ఉద్యోగులంతా పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. తద్వారా ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి ప్రభుత్వానికి నివేదించగా.. ఆయా ఆవాసాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరాకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోనున్నాం.

జోన్లుగా గ్రామాల విభజన


ఉమ్మడి జిల్లాలో ప్రతీ మనిషికి 100 లీటర్ల తాగునీరు అందించాలనేది లక్ష్యం. ఈ స్థాయిలో నీరు అందుతున్న గ్రామాలను గ్రీన్ జోన్‌గా గుర్తించాం. ఇక 55–100లీటర్లు అందించే గ్రామాలను ఆరెంజ్ జోన్‌గా, 20–55లీటర్లు అందించే గ్రామాలను ఎల్లో జోన్‌గా, 20లీటర్ల కంటే తక్కువ సరఫరా అవుతున్న గ్రామాలను రెడ్‌జోన్‌గా విభజించాం. అయితే, గత ఏడాదితో పోలిస్తే ఇప్పటికైతే 20 శాతం నీరు అధికంగానే ఉంది. మిషన్ భగరథ పైప్‌లైన్ ఉన్న గ్రామాలకు గ్రిడ్ ద్వారా, లేనిపక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం.

మారుమూల పల్లెలకు సైతం...

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మారుమూల పల్లెల్లోనూ ఇప్పటికే స్థానికంగా ఉన్న వనరుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం. ఆదివాసీ గూడెంల్లో సైతం బోర్లు వేసి సోలార్ ప్యానళ్ల ద్వారా నిరంతరాయంగా నీరు అందిస్తున్నాం. త్వరలోనే ఆయా ప్రాంతాలకు సైతం గ్రిడ్ ద్వారా నీరు ఇవ్వాలనేది లక్ష్యం. లేకపోతే బోర్లు, బావులు.. అవీ అందుబాటులో లేకపోతే వ్యవసాయ బావులను అద్దె ప్రాతిపదికన తీసుకుంటాం, ఇవన్నీ సాధ్యం కాకపోతే చివరగా ట్యాంకర్లు పంపిస్తాం.

అందరి సమన్వయంతో...

పోలీసు, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య శాఖ మాదిరిగానే మా శాఖ సైతం ఎమర్జెన్సీ విభాగమే. అందుకే నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎక్కడ సమస్య ఎదురైనా వెంటనే మరమ్మతులు చేసి నీటిసరఫరా పునరుద్ధరిస్తున్నాం. గతంలో జగిత్యాల జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌ఈగా చేరినందున ఉమ్మడి జిల్లా అంతటా పరిశీలించి అధికారులు, సిబ్బంది సయన్వయంతో రానున్న మూడు నెలలు నీటి ఎద్దడి ఎదురుకాకుండా చూడడమే లక్ష్యం.



ఎస్‌ఈకి శుభాకాంక్షలు చెబుతున్న ఈఈ పుష్పలత తదితరులు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మిషన్ భగీరథ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా గడ్డం శేఖర్‌రెడ్డి శుక్రవారం విధుల్లో చేరారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లాలో ఈఈగా పనిచేస్తున్న శేఖర్‌రెడ్డిని ఎస్‌ఈగా పదోన్నతిపై ఖమ్మం సర్కిల్‌కు కేటాయించారు. దీంతో విధుల్లో చేరగా.. మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, గ్రిడ్ ఈఈ వాణిశ్రీ, కొత్తగూడెం ఈఈ నళిని, డీఈలు, ఏఈలు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ వాల్యూయేషన్

జిల్లాకు 2,97,766జవాబుపత్రాలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈనెల 20న పూర్తికాగా, జవాబుపత్రాల మూల్యాంకనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాంపు ఏర్పాటుచేయగా ఈనెల 10వ తేదీ నుంచే సంస్కృతం సబ్జెక్ట్ జవాబుపత్రాల వాల్యూయేషన్ ప్రారంభమైంది. నేటి నుంచి సబ్జెక్టు జవాబుపత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు. ఈమేరకు నయాబజార్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు శుక్రవారం సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు. వివిధ జిల్లాల నుంచి 1,83,415జవాబుపత్రాలు వచ్చాయని తెలిపారు. మూల్యాంకనం కోసం 1,500మందిని నియమించగా, నాలుగు విడతల్లో ప్రక్రియ కొనసాగుతుందన్నారు. క్యాంప్ ఆఫీసర్‌గా డీఐఈఓ రవిబాబు, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్–1, 2గా కె.శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్ వ్యవహరిస్తారు.

స్వర్ణకవచాలంకరణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణకవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆపై స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు.

క్లుప్తంగా

ఉద్యమకారుల త్యాగాలను మరవొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

కూసుమంచి: తెలంగాణ ఏర్పాటులో కీలకమైన ఉద్యమకారుల త్యాగాలను విస్మరించకుండా, ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చేగొమ్మలో శుక్రవారం నిర్వహించిన జిల్లా ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల త్యాగాలు, బలిదానాల పునాదులపై తెలంగాణ ఏర్పడినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైనా పెన్షన్, ఇంటి స్థలం విషయంలో స్పందించాలన్నారు. కాగా, ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా అంబాల రామారావు ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా అంగడి భిక్షం, ఉపాధ్యక్షులుగా ఉల్లంగి పద్మ, అఫ్జల్‌తో పాటు వివిధ పదవులకు ఫకృద్దీన్, పాపయ్య, రాజేష్, వెంకన్న, అంజయ్య, అశోక్‌సింగ్, మత్తయ్య, వెంకటరెడ్డిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో డీఎంహెచ్ఓ తనిఖీ

కల్లూరు: కల్లూరులోని కృష్ణచైతన్య ఆస్పత్రిని డీఎంహెచ్ఓ కళావతిబాయి శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు, ఐసీయూ, వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించిన ఆమె ఆస్పత్రి సేవలు, ఫీజుల వివరాలతో బోర్డు ప్రదర్శించాలని డాక్టర్ కృష్ణచైతన్యకు సూచించారు. అలాగే, అర్హత ఉన్న సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నవ్యకాంత్, మాస్‌మీడియా అధికారి సాంబశివారెడ్డి, డీపీఓ దుర్గ, హెల్త్ సూపర్‌వైజర్ జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టోర్నీలో రాణించిన అథ్లెట్‌కు సన్మానం


వైశాలి, ఆమె తండ్రి, కోచ్‌తో కలెక్టర్, డీవైఎస్ఓ

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల బిహార్ రాష్ట్రం పాట్నాలో జరిగిన జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మంకు చెందిన బి.వైశాలి హెప్టాథ్లిన్ విభాగం నుంచి ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెతో పాటు తండ్రి కొండయాదవ్, కోచ్ ఎం.డీ.గౌస్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం సన్మానించారు. డీవైఎస్ఓ తుంబూరు సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు నున్నా రాధాకృష్ణ, మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ పాల్గొన్నారు.

'వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కుట్ర'

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ల పేరిట మావోలను చంపడం కాకుండా, ఈ సమస్యకు శాంతి చర్చల ద్వారా పరిష్కారం వెతకాలని సూచించారు. వచ్చే ఏడాది మార్చి 31నాటికి నక్సల్స్ లేకుండా చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా చెప్పడమంటే మానవ హక్కులను హరించడమేనని తెలిపారు. కాగా, ఆదివాసీ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించకుండా బలగాలను మోహరించి, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

యోగాతో గర్భిణులకు మేలు

ఖమ్మంఅర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవడమే కాక గర్భిణులకు సాధారణ ప్రసవం జరిగే అవకాశాలు పెరుగుతాయని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సైదులు తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణంలో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల స్టాఫ్‌నర్స్‌లకు శుక్రవారం యోగా శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ యోగాతో ప్రయోజనాలకు గర్భిణులకు వివరించాలని సూచించారు. తద్వారా జిల్లాలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. ప్రాంగణం మేనేజర్ విజేత, ఉద్యోగులు రామారావు, రఘురాం, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి అమ్మి వస్తుండగా ప్రమాదంలో రైతు మృతి

కామేపల్లి: మిర్చి పంటను మార్కెట్‌లో అమ్మి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో రైతు మృతి చెందాడు. మండలంలోని హరిశ్చంద్రాపురం గ్రామానికి చెందిన జర్పుల రమేశ్(32) శుక్రవారం మిర్చి బస్తాలతో ఖమ్మం మార్కెట్‌కు వెళ్లివిక్రయించాక ఇంటికి బయలుదేరాడు. మద్దిగూడెం సమీపాన ఆయన బైక్‌ను ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేశ్‌కు తీవ్రగాయాలు కాగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా సాయంత్రం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనతికాలంలోనే అనేక విజయాలు

- ఇకపై పూర్వ వీఆర్‌ఏలు, వీఆర్వోలకు మంచి రోజులు
- ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఎన్నో చారిత్రక పోరాటాలు, జాతీయ స్థాయి ఉద్యమాలకు పురుడు పోసుకున్న ఖమ్మం వేదికగా తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆత్మీయ సమ్మేళనాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, సీఎస్ సహకారంతో అనేక విజయాలు సొంతమయ్యాయని చెప్పారు. సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సాధన, పోస్టుల సంఖ్య పెంపు, గ్రామానికో అధికారి నియామకం సహా పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలను మాతృశాఖలోకి తీసుకోవడం వంటి విజయాలు సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో మిగతా సమస్యలను కూడా ప్రభుత్వ సహకారంతో పరిష్కరించుకుంటామని చెప్పారు. ఈసమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, పి.రమేష్, వివిధ సంఘాల బాధ్యులు ఫూల్‌సింగ్, నరసింహారావు, మంగీలాల్, టి.శ్రీనివాస్, కె.రవికుమార్, అశోక్‌కుమార్, భద్రునాయక్, జి.రాజు, మాణిక్యరావు, ప్రతాప్, అభిరామ్, మురళి, రాంరెడ్డి, భిక్షం, గరికె ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళలు, కళాకారులను ప్రోత్సహించాలి


కళాకారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

మధిర: అంతరించిపోతున్న కళలతో పాటు కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరముందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. మధిర బంజారా కాలనీలోని వెంకటేశ్వరస్వామి కళ్యాణమండపంలో మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యాన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఏకపాత్రాభినయం, సన్నివేశాల పోటీలు శుక్రవారం మొదలయ్యాయి. ఈసందర్భంగా కొండబాల మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను ఈ తరానికి పరిచయం చేసేలా కళాపరిషత్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. తొలుత టౌన్ అదనపు ఎస్ఐ చంద్రశేఖర్ పోటీలను ప్రారంభించగా వివిధ ప్రాంతాల కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించాయి. శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపకులు గడ్డం సబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, గడ్డం శ్రీనివాసరావుతో పాటు బాబ్లా, మునుగోటి వెంకటేశ్వర్లు, జంగాల గురువులు, ఇరుకుళ్ల లక్ష్మీనరసింహరావు పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా పాకాలపాటి రోశయ్య చౌదరి, పంతంగి చెన్నారావు, తాటికొండ నరసింహారావు, హరినాథ్ వ్యవహరించారు.

కేంద్రప్రభుత్వ తీరు గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: రైతాంగ వ్యతిరేక చర్యలు అవలంబించడమే కాక న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుతమార్గంలో చేపడుతున్న ఆందోళనలను అడ్డుకోవడం గర్హనీయమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఢిల్లీలో రైతుల ఆందోళనపై కేంద్రప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని ఆరోపిస్తూ శుక్రవారం తెలంగాణ రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు పోటు కళావతి, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, కూచిపుడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బానోత్ రామకోటి, ఏలూరి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

విపక్షకు వ్యతిరేకంగా పోరాటాలు

వ్యవసాయ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మిర్చి రైతులకు మద్దతు ధర దక్కేలా ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలని, మొక్కజొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రప్రభుత్వం స్పందించి రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రామ్‌కోటి, కూచిపుడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, దొబ్బల వెంగళరావు, బాగం ప్రసాద్, బానోత్ రవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు రక్షించినా.. విధి వక్రీకరించింది

- చికిత్స కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన వృద్ధురాలు
- ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో లిఫ్ట్ తీగ తెగిపడడంతో ప్రమాదం


సరోజనమ్మ (ఫైల్)

ఖమ్మంక్రైం: గుండెపోటు వచ్చిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రసూన ఆస్పత్రికి తీసుకురాగా.. చికిత్సలో భాగంగా స్టంట్ వేశారు. దీంతో కుటుంబీకుల్లో ఆనందం నిండగా.. అది కొద్ది గంటల్లోనే ఆవిరైపోయింది. లిఫ్ట్ రూపంలో ఆమెను మృత్యువు మహిళను బలి తీసుకున్న ఘటన వివరాలు..

ఐసీయూకు తరలిస్తుండగా..

ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన సట్టు సరోజనమ్మ(64)కు మూడు రోజుల క్రితం గుండెపోటు రాగా ఖమ్మం వైరారోడ్డులోని ప్రసూన ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షల అనంతరం వైద్యులు ఆమెకు శుక్రవారం రాత్రి మూడో అంతస్తులోని ఆపరేషన్ థియేటర్‌లో స్టంట్ వేశారు. తిరిగి రెండో అంతస్తులోని ఐసీయూకు తరలించేందుకు లిఫ్ట్ వద్దకు తీసుకొచ్చారు. మొదట వార్డ్‌బాయ్ దుర్గాప్రసాద్ లిఫ్ట్‌లోకి వెళ్లగా స్ట్రెచర్ సగం బయటే ఉంది. మరో బాయ్ రవి బయటే ఉండగా.. దుర్గాప్రసాద్ లోపల రెండో నంబర్ బటన్ నొక్కాడు. అయితే, లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఎదురై కిందకు కాకుండా ఒకేసారి పెద్ద శబ్దంతో తలుపులు మూసుకోకుండానే పైకి వెళ్లింది. అప్పటికే బయట ఉన్న రవి స్ట్రెచర్‌ను లాగే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. దీంతో సరోజనమ్మ సెల్లార్‌లో పడిపోవడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఇక దుర్గాప్రసాద్ నాలుగో అంతస్తుకు వెళ్లాక లిఫ్ట్‌లో చిక్కుకుని హాహాకారాలు చేస్తుండగా సిబ్బంది వెళ్లి రక్షించారు. మరో వార్డు బోయ్ రవికి గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. కాగా, సరోజినమ్మ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా కుటుంబసభ్యులు బోరున విలపించారు.

ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే..

ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని మృతురాలి బంధువులు ఆరోపించారు. కొంతకాలంగా లిఫ్ట్ మొరాయిస్తున్నా తాత్కాలికంగా మరమ్మతు చేయిస్తున్నారని వాపోయారు. ఆస్పత్రి వద్దకు మృతురాలి బంధువులు భారీగా చేరుకోవడంతో పోలీసులు బందోబస్తు చేపట్టారు. అయితే మృతురాలి బంధువులతో ఆస్పత్రి యాజమాన్యం రాజీ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

పాఠశాలలో క్రీడాసామగ్రి చోరీ

మధిర: మండలంలోని ఆత్కూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రాత్రి చోరీ జరిగింది. పాఠశాలకు శుక్రవారం ఉదయం వచ్చిన ఉపాధ్యాయులు తరగతి గదుల తాళాలు పగలగొట్టి ఉండడంతో ఈ విషయాన్ని గుర్తించారు. ఈ మేరకు తరగతి గదుల్లో బీరువాలు పగలగొట్టినా అందులో ఏమీ దొరకక, ఇటీవల కొనుగోలు చేసిన క్రీడాసామగ్రి ఎత్తుకెళ్లారు. దీంతో ఉపాధ్యాయులు ఇచ్చిన సమాచారంతో టౌన్ పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇరవై రోజులు క్రితమే ఇదే స్కూల్ పరిసరాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌లో దొంగలు చొరబడి రూ.15 వేల విలువైన సరుకులు, సిలిండర్ ఎత్తుకెళ్లారు.

చెరువుమాధారంలో...

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం పాఠశాలలో చోరీ జరిగింది. ఇటీవల ప్రభుత్వం కేటాయించిన రూ.25 వేలతో వెచ్చించి క్రీడా సామగ్రిని కొనుగోలు చేశారు. అయితే, గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తాళాలు పగలగొట్టి బీరువాలో భద్రపరిచిన సామగ్రిని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం గుర్తించిన ఇన్‌చార్జ్ ఉజ్వల ఎంఈఓకు చలపతిరావుకు సమాచారం ఇవ్వగా శనివారం పోలీసులకు చేయనున్నట్లు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ఖమ్మంవ్యవసాయం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) కృషి చేస్తోందని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 126వ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా బ్యాంకు పని చేస్తోందని, ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్నామని చెప్పారు. ఇన్‌చార్జి సీఈఓ ఎస్.వెంకటఆదిత్య మాట్లాడుతూ సంఘాల అభ్యర్థన మేరకు దీర్ఘకాలిక రుణాల మంజూరుకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. తొలుత 2024–25 అర్ధ వార్షిక నివేదికను ప్రవేశపెట్టగా, 2025–26 ప్రతిపాదిత బడ్జెట్, తదితర అంశాలను ఆమోదించారు. బ్యాంకు డైరెక్టర్లు, సంఘాల చైర్మన్లు, జిల్లా సహకార అధికారి జి.గంగాధర్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

ప్రమాదంలో వధువు తల్లి మృతి


పుష్పావతి (ఫైల్)


తల్లి మృతదేహంపై పడి రోదిస్తున్న హర్షిణి

సత్తుపల్లిటౌన్/రూరల్: ఇంకా వచ్చని పందిరి తీయలేదు.. భాజాభజంత్రీల శబ్దం చెవులను వీడలేదు.. ఇంతలోనే నూతన వధూవరులతో కలిసి దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో వధువు తల్లి మృతి చెందగా.. తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం బేతుపల్లి వద్ద శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లికి చెందిన వ్యాపారి అడపా రాజేంద్రప్రసాద్ – పుష్పావతి ఏకైక కుమార్తె హర్షిణి వివాహం ఈనెల 16న జరిగింది. నూతన వధూవరులతో కలిసి అందరూ అశ్వారావుపేట సమీపాన శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణానికి వెళ్లారు. ఆతర్వాత నూతన దంపతులను జంగారెడ్డిగూడెంలోని అత్తగారి ఇంటికి సాగనంపి.. హర్షిణి తల్లిదండ్రులు పుష్పావతి(55), రాజేంద్రప్రసాద్ కారులో సత్తుపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమాన బేతుపల్లి సమీపంలో వీరి కారు – ఎదురుగా వచ్చిన పాలవ్యాన్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో పుష్పావతి, రాజేంద్రప్రసాద్‌కు గాయాలు కాగా 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చేసరికి పుష్పావతి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలియడంతో జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన హర్షిణి తల్లి మృతదేహంపై పడి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, పలువురు వ్యాపారులు, స్థానికులు సైతం పుష్పావతి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈమేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కామంచికల్ శివారు ముత్యాలగూడెంకు చెందిన లింగనబోయిన నాగేశ్వరరావు(52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మేకలు కాపరిగా జీవనం సాగిస్తున్న ఆయన కొన్నాళ్లనుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో ఈనెల 20న పురుగుల మందు తాగగా ఖమ్మంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య చంద్రకళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కవిరాజ్‌నగర్‌కు చెందిన గింజపల్లి నవీన్(30) ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన ఆయన కొంతకాలంగా ఖమ్మంలో ఉంటూ ప్రైవేట్ ఆస్పత్రి సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. కాగా, నవీన్ భార్య భానుశ్రీతో మనస్పర్థలు ఏర్పడగా ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు ఆయన తండ్రి ఫిర్యాతో కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

తండ్రి లేకున్నా మొక్కవోని ధైర్యం

తొలి ప్రయత్నంలోనే రెండు ఉద్యోగాలు సాధించిన యువతి


ఆమంచి భౌమి

తిరుమలాయపాలెం: చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా తల్లి, కుటుంబీకుల ప్రోత్సాహంతో మండలంలోని బచ్చోడుకు చెందిన యువతి తొలి ప్రయత్నంలోనే రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. బచ్చోడుకు చెందిన ఆమంచి శ్రీనివాసరావు – స్వప్న కుమార్తె భౌమి రెండేళ్ల వయస్సులోనే తండ్రి మృతి చెందాడు. దీంతో తాతయ్య, నానమ్మ వెంకన్న, నాగలక్ష్మి, తల్లి స్వప్న వద్ద పెరిగిన ఆమె హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసింది. ఆతర్వాత ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతూ మిషన్ భగీరథలో ఏఈగా, మున్సిపల్ అండ్ టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఓగా ఎంపికై ఈనెల 20న హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందుకుంది. ఈసందర్భంగా భౌమిని పలువురు అభినందిస్తున్నారు.

మధ్య తరగతి కుటుంబం నుంచి...


శశికుమార్

మధిర: మండలంలోని దెందుకూరుకు చెందిన దారా శశికుమార్ రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. 2022లో వెల్లడైన ఫలితాల్లో టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ ఓవర్సీసర్‌గానే కాక పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగాలు సాధించాడు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆయన ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోగా కుటుంబీకుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఏఈగా హిమవర్షిణిరెడ్డి


హిమవర్షిణిరెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లికి చెందిన హిమవర్షిణిరెడ్డి పంచాయతీరాజ్ ఏఈగా ఎంపికైంది. గత ఏడాది జరిగిన పరీక్షలో ప్రతిభ చాటిన ఆమె ఉద్యోగానికి ఎంపిక కాగా హైదరాబాద్ ఈఎన్‌సీ కార్యాలయంలో పోస్టింగ్ ఉత్తర్వులను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకుంది. సత్తుపల్లికి చెందిన గోలి శ్రీనివాసరెడ్డి – రుషికుమారి కుమార్తె అయిన హిమవర్షిణి ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి 10వ ర్యాంక్ సాధించాక, తాడేపల్లిగూడెంలో నిట్‌లో బీటెక్ పూర్తి చేసింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చినా పట్టుదలతో చదివి ఏఈగా ఎంపికైన ఆమె గ్రూప్–1 సాధించడమే లక్ష్యమని వెల్లడించారు. ఈ సందర్భంగా హిమవర్షిణిని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, తదితరులు అభినందించారు.

ఫిట్స్‌తో పడిపోయిన ఎస్సెస్సీ విద్యార్థి

చికిత్స అనంతరం పరీక్ష రాయించిన ఉపాధ్యాయులు


ధనుష్‌ను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజేష్

నేలకొండపల్లి: ఎస్సెస్సీ పరీక్షకు హాజరైన ఓ విద్యార్థి పిట్స్‌తో పడిపోగా, చికిత్స చేయించి ఉపాధ్యాయులు ఆతర్వాత పరీక్ష రాయించారు. మండలంలోని రాయగూడెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బోయిన ధనుష్ చెరువుమాధారం పరీక్ష కేంద్రానికి చేరుకున్నాడు. పరీక్ష ప్రారంభమైన అరగంటకు ఆయన ఫిట్స్‌తో పడిపోగా స్థానికంగా చికిత్స చేయించినా ఫలితం లేక 108లో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ రాజేష్ చికిత్స చేశాక పరీక్ష ఉందని చెప్పడంతో సెలైన్ బాటిల్‌తో ధనుష్‌ను పంపించారు. పరీక్ష పూర్తయ్యాక మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చి పరీక్షలు చేయించగా ఎంఈఓ బి.చలపతిరావు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య ఆయనను పరామర్శించారు.

■ ముదిగొండ: మండలంలోని బాణాపురానికి చెందిన ఓ యువకుడు స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్ష జరుగుతుండగా పాఠశాల ప్రహరీ దూకి లోనకు వచ్చాడు. దీంతో గుర్తించిన కానిస్టేబుల్ ఆ యువకుడిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే, యువకుడు ఎందుకు వచ్చాడో తెలియరాలేదు.


గాయాలతో పరీక్షకు హాజరైన ఉమేష్

■ వైరా: వైరాలోని ప్రభుత్వ పాఠశాల కేంద్రానికి ఓ విద్యార్థి గాయాలతోనే హాజరయ్యాడు. వైరా మండలం సిరిపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఉమేష్ చంద్రకు ఇటీవల ప్రమాదంలో గాయాలయ్యాయి. అయినా తల, ముఖానికి కట్లతోనే పరీక్షకు వచ్చాడు.

■ వైరారూరల్: వైరా మండలం కేజీ సిరిపురానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ లతీఫ్ తన ఆటోలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. గరికపాడు జెడ్పీహెచ్ఎస్ నుండి వైరాలోని కేంద్రాలకు ప్రతిరోజు ఉచితంగా తీసుకెళ్లి మళ్లీ తీసుకొస్తానని వెల్లడించాడు.



విద్యార్థినులను తీసుకెళ్తున్న లతీఫ్

యూఎస్‌లో విజయ'గీతిక'

మిస్ తెలుగు యూఎస్ఏ ఫైనలిస్ట్‌ల్లో జిల్లా యువతి


పిల్లలమర్రి గీతిక

బోనకల్: 'మిస్ తెలుగు యూఎస్ఏ – 2025' పోటీల్లో బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన యువతి గీతిక ఫైనల్స్‌కు చేరింది. అమెరికాలో స్థిరపడిన, చదువుకుంటున్న తెలుగు వారి కోసం ఏటా ఈ పోటీలు నిర్వహిస్తారు. ఈ ఏడాది తెలుగు భాష గొప్పతనం, ఆత్మగౌరవం, సంస్కృతి, జీవన విధానం, అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ, అభినయం, సంగీతం, మేధస్సు తదితర అంశాలతో విజేతను ఎంపిక చేయనుండగా గీతిక ఫైనల్స్‌కు చేరింది. మే 25న గ్రాండ్ ఫినాలే డల్లాస్‌లో జరగనుండగా విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేస్తోంది. కాగా, ముష్టికుంట్లకు చెందిన పిల్లలమర్రి శివనర్సింహారావు–మాధవి దంపతుల పెద్ద కుమార్తె గీతిక ప్రాథమిక విద్య ఖమ్మంలో,బీటెక్ చెన్నైలో పూర్తి చేశాక అమెరికాలోని సిన్సినాటీ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతోంది.

గంజాయి సీజ్

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శుక్రవారం భద్రాచలంలోని బ్రిడ్జి సెంటర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి ద్విచక్రవాహనంపై రెండు కిలోల గంజాయిని ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్తుండగా వాహన తనిఖీల్లో పోలీసులు పట్టుకున్నారు. నిందితులైన ఖమ్మం జిల్లా వైరాకు చెందిన సమీర్, రామకృష్ణలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుబాబుల్ తోట దహనం

మధిర: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపంతో నిప్పురవ్వలు ఎగిసిపడగా మండలంలోని దెందుకూరులో అయతం ప్రసాద్ సాగు చేస్తున్న రెండున్నర ఎకరాల సుబాబుల్ తోట గురువారం రాత్రి కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ నుండి ఎగిసిపడిన నిప్పురవ్వలు పక్కనే ఉన్న సుబాబుల్ తోటలో మొక్కలపై పడడంతో కాలిపోయాయి. ఈమేరకు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పినా అప్పటికే రూ.3లక్షల మేర నష్టం వాటిల్లిందని ప్రసాద్ వాపోయారు.

బైక్ తగలబెట్టిన దుండగులు

నేలకొండపల్లి: ఇంటి వద్ద పార్క్ చేసిన బైక్‌ను దూరంగా తీసుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టిన ఘటన ఇది. మండలంలోని నాచేపల్లికి చెందిన గోగుల రామారావు ఇంట్లో నిలిపిన వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున గ్రామ శివారుకు తీసుకెళ్లిన దుండగులు దహనం చేశారు. కాగా, రామారావు ఇటీవల పాముకాటుకు గురికాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంతలోనే ఈ ఘటన జరగడంతో ఎవరు చేశారో తెలియక స్థానికంగా చర్చ జరుగుతోంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెం శివారులో పేకాట స్థావరం ఏర్పాటు చేశారనే సమాచారంతో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ మొక్కజొన్న తోటలో కొందరు పేకాట ఆడుతున్నారని పోలీసులు తనిఖీలకు వెళ్తుండగా గమనించిన జూదరులు పొలాల వెంట పడి పరుగులు తీశారు. అక్కడ ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన వారు ఉన్నట్లు తెలుస్తుండగా, ఘటనాస్థలంలో లభించిన బైక్‌లను పంచాయతీ ట్రాక్టర్ ద్వారా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని పోలీసులు మాత్రం ధ్రువీకరించలేదు.

గంగబండ తండాలో ఉద్రిక్తత

కూసుమంచి: ఓ యువకుడి మృతితో మండలంలోని గంగబండ తండాలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. తండాకు చెందిన బానోత్ ఉపేందర్ ఈనెల 14న ఎలుకల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం తండాకు తీసుకరాగా ఘటనకు ఓ దుకాణదారుడే కారణమని ఆరోపిస్తూ ఉపేందర్ కుటుంబీకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. దీంతో పోలీసులు అప్రమత్తమై అడ్డుకుని, పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామని సర్దిచెప్పడంతో అంత్యక్రియలు పూర్తిచేశారు.